సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023



అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శం

అభివృద్ధి, సంక్షేమం విషయంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. 8లో



ఈ 40 రోజులూ ధ్యానమే..

క్రైస్తవులు ప్రతి సంవత్సరం నిర్వహించే 40 రోజుల ఉపవాస దీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 10లో

గరిష్టం / కనిష్టం
38° / 20°

వాతావరణం

జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రికి చలి ప్రభావం తక్కువగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణం వేడుక నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

25 నుంచి 'మోడల్' ప్రవేశాలకు ఎంపికలు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కిన్నెరసాని గిరిజన బాలుర మోడల్ స్కూల్, గుండాల మండలం కాచనపల్లి బాలికల మోడల్ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంలో ఐదో తరగతిలో ప్రవేశాల కోసం ఈనెల 25 నుంచి 28 వరకు జిల్లాస్థాయిలో ఎంపికలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ క్రీడాధికారి డాక్టర్ వీరునాయక్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 9 నుంచి 11 సంవత్సరాల వయసు గలవారు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు కుల ధ్రువీకరణతో పాటు స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 89784 77345 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

24న అప్రెంటిస్ అవేర్‌నెస్ వర్క్‌షాప్

- జిల్లా ఉపాధి కల్పనాధికారి విజేత

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో ఈనెల 24న అప్రెంటిస్ రిఫార్మ్ అవేర్‌నెస్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వేల్పుల విజేత తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆరుగిరి కంటే ఎక్కువ మంది వర్కర్లు ఉన్న వ్యాపార, విద్యా సంస్థలు, సినిమా థియేటర్లు, ఇతర సంస్థల యజమానులు వర్క్‌షాప్‌నకు హాజరు కావాలని సూచించారు. కంపల్సరి నోటిఫికేషన్ యాక్ట్ 1956, అంప్రెటిస్‌షిప్ యాక్ట్ 1961 ప్రకారం పాటించాల్సిన నియమ నిబంధనల గురించి ఈ వర్క్‌షాప్‌లో వివరిస్తామని తెలిపారు.

ఏసీబీ అధికారుల ఫోన్ నంబర్లు మార్పు

ఖమ్మంక్రైం: ఖమ్మం రేంజ్ పరిధిలోని అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులకు కొత్త ఫోన్ నంబర్లు కేటాయించారు. ఈవిషయాన్ని రేంజ్ డీఎస్పీ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలి పారు. కొత్త నంబర్లు మంగళవారం నుంచి అమల్లోకి వచ్చాయని.. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ శాఖల ఉద్యోగుల అవినీతిపై ఇక నుంచి ఇవే నంబర్ల ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు.

డీఎస్పీ	91543 88981
సీఐ, ఖమ్మం వన్ టౌన్	91543 88984
సీఐ, ఖమ్మం టు టౌన్	91543 88986
ట్రోల్ ఫ్రీ నంబర్	1064

మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం



జన్నారంలో మిర్చిని పరిశీలిస్తున్న ఖమ్మం డీఆర్డీఓ విద్యాచందన

ఏన్కూరు: మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేస్తామని ఖమ్మం డీఆర్డీఓ విద్యాచందన తెలిపారు. మండలంలోని హిమామ్‌నగర్, జన్నారం గ్రామాల్లో నర్సరీలు, మిర్చి కల్లాలను మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్లాంట్ లిపిడ్ సంస్థ ద్వారా ఐకేపీ ఆధ్వర్యాన గ్రామాల రైతుల నుంచి మిర్చి కొనుగోళ్లు చేస్తామని, సంస్థ ప్రతినిధులతో మాట్లాడి గిట్టుబాటు ధర వచ్చేలా చూస్తామని పేర్కొన్నారు. డీపీఎం శ్రీనివాస్, ఎంపీడీఓ బయ్యాపు అశోక్, ఏపీఎం హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

'కారుణ్యం'లో దందా !



భూగర్భ గనిలో పనిచేస్తున్న సింగరేణి కార్మికులు

- సింగరేణిలో దరఖాస్తుదారులకు ఫోన్ చేస్తున్న దళారులు
- మేం చెప్పినట్టు వింటే ఉద్యోగం గ్యారెంటీ..
- కాదంటే మీ ఇష్టం.. అంటూ మాయమాటలు
- మెడికల్ బోర్డు పేరుతో భారీగా వసూళ్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కఠిన చర్యలు కరువైపోవడంతో సింగరేణి కారుణ్య నియమాకాల్లో అక్రమాలకు అడ్డుకట్ట పడడం లేదు. లక్షల రూపాయలు తమకు ముట్టజెబితేనే పని జరుగుతుందని, లేదంటే మీ ఆశలు అడియాసలే అని ఫోన్ల ద్వారా సంప్రదింపులు చేస్తున్న దళారులు మరోసారి దందాకు తెరలేపారు. చెవులు చిల్లులు పడేలా బ్లాస్టింగు శబ్దాలు, దట్టమైన దూళి కణాలు, భారీ యంత్రాల మోతల మధ్య సింగరేణిలో ఏళ్ల తరబడి కార్మికులు పని చేస్తున్నారు. కాలుష్య వాతావరణానికి తోడు వయసు పైబడటంతో కొందరు కార్మికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. పూర్తి శక్తి సామర్థ్యాలతో సంస్థలో పని చేయలేకపోతున్నారు. ఇలాంటి వారిలో రెండేళ్లకు మించి సర్వీసు ఉంటే వారి వారసులకు (కొడుకు, అల్లుడు, కూతురు) కారుణ్య నియామకాల కింద ఉద్యోగావకాశాలను సింగరేణి సంస్థ కల్పిస్తోంది. కారుణ్య నియామకాల ద్వారా కుటుంబ సభ్యుడికి ఉద్యోగం రావాలంటే సదరు కార్మికుడు మెడికల్ అన్ ఫిట్ అని నిర్ధారించాల్సి ఉంటుంది. దీని కోసం సింగరేణి సంస్థ ఐదుగురు వైద్య నిపుణులతో కూడిన మెడికల్ బోర్డును ఏర్పాటు చేసింది. వీరు కార్మికుడి ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి గుండె, నరాలు, కళ్లు, పక్షవాతం, కీళ్ల నొప్పులు తదితర 16 రకాలైన అనారోగ్య సమస్యలతో బాధపడేవారిని మెడికల్ అన్‌ఫిట్‌గా గుర్తిస్తారు. ఇలా గుర్తించిన వారి వారసులకు సింగరేణిలో ఉద్యోగం వస్తుంది. అయితే ఈ కారుణ్య నియామకాల ప్రక్రియ కొందరు రాజకీయ నాయకులు, కార్మిక సంఘ నేతలకు కామధేనువుగా మారింది. సంస్థ ఉన్నతికి చెమటోడ్చిన కార్మికుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు అమలు చేస్తున్న పథకాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు.

రూ. 8 లక్షల వరకు..

ఇటీవల కాలంలో సింగరేణిలో అక్షరాస్యత పెరిగింది. కానీ గతంలో అక్షరాస్యతతో సంబంధం లేకుండానే చాలా మంది కార్మికులుగా చేరారు. వీరిలో చాలా మంది వయసు ప్రస్తుతం యాభైకి పైగానే ఉంది. ఇలాంటి వారే తమ అనారోగ్య సమస్యలతో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేస్తున్నారు. వీరి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దళారులు దండుకుంటున్నారు. వ్యక్తుల అవసరం, ఆర్థిక స్తోమతను బట్టి ఒక్కో కార్మికుడి నుంచి రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు కారుణ్య నియామకాల పేరిట వసూలు చేస్తున్నారు. ఈ విషయం బయట ఎక్కడైనా పొక్కితే తమ వారసులకు ఎక్కడ ఉద్యోగాలు రావో అనే సందేహంతో చాలా మంది మూడో కంటికి తెలియకుండా దళారులకు లక్షల రూపాయలు ముట్టజెబుతున్నారు.

నేడు, రేపు మెడికల్ బోర్డు..



మెడికల్ బోర్డు పరీక్షలు నిర్వహించే సింగరేణి ప్రధానాస్పత్రి ఇదే..

కారుణ్య నియామకాలకు సంబంధించి మెడికల్ బోర్డు ఈనెల 22, 23 తేదీల్లో కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రిలో సమావేశం కానుంది. వివిధ ఏరియాల నుంచి మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికుల ఆరోగ్య స్థితిగతులను అంచనా వేయనుంది. దీంతో దళారులు వెంటనే రంగంలోకి దిగారు. అనారోగ్య కారణాలతో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికుల వివరాలను అక్రమ పద్ధతుల్లో సేకరించారు. తద్వారా సదరు కార్మికులకు ఫోన్లు చేసి బేరాలు మొదలెడుతున్నారు. 'మేం చెప్పినట్టు వింటే మెడికల్ బోర్డు నుంచి సులువుగా అన్‌ఫిట్ సర్టిఫికెట్ వస్తుంది. ఆ తర్వాత కోరుకున్న ఏరియాలో, కోరుకున్న విభాగంలో మీ కుటుంబసభ్యులకు ఉద్యోగం వస్తుంది. కాదని సొంతంగా ముందుకు వెళితే అన్‌ఫిట్ అవలేరు.. ఆ తర్వాత మీ ఇష్టం' అంటూ మాటలు కలుపుతున్నారు. గతంలో ఇలాంటి ఫైళ్లు తాము ఎన్ని చక్కబెట్టామో ? దానికి సంబంధించి ఎంత సమర్పించాలో తదితర వివరాలన్నీ ఫోన్లలోనే చెప్పేస్తున్నారు.

'నవమి' ఏర్పాట్లు ఘనంగా ఉండాలి

సమీక్ష సమావేశంలో కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రతి భక్తుడు స్వామి వారి కల్యాణ వేడుక వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. శ్రీరామనవమి, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం మహోత్సవాల నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో ఐడీఓసీ కార్యాలయంలో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతేడాది భక్తుల మన్ననలు పొందేలా వేడుకలు నిర్వహించామని, అదే స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. మార్చి 30న శ్రీరామనవమి, 31న పుష్కర పట్టాభిషేకం మహోత్సవాలు ఉంటాయని, ఇందుకోసం మిథిలా స్టేడియాన్ని సిద్ధం చేయాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్ పర్యవేక్షణకు జిల్లా స్థాయి అధికారిని నియమించాలన్నారు. వేడుకల నిర్వహణకు కార్యాచరణతో పాటు పర్యవేక్షణ కూడా ముఖ్యమని అన్నారు. వచ్చే నెల 25వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలని స్పష్టం చేశారు. మార్చి 1 నుంచి టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓ కార్యాలయాల్లో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్, మీ సేవ, కార్గో సర్వీసుల ద్వారా భక్తులకు తలంబ్రాలు, ప్రసాదాలు చేరవేసేలా చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక పంపిణీ కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని డీపీఆర్‌ఓకు సూచించారు. సెక్టార్లలో ఎల్ఈడీ టీవీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. మిథిలా స్టేడియంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని, బస్సుల్లో భక్తులకు ఉచితంగా తలంబ్రాలు పంపిణీ చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని డీపీఓను ఆదేశించారు. భక్తులు ఎండనుంచి ఉపశమనం పొందేందుకు మజ్జిగ, మంచినీరు సరఫరా చేయాలని, తినుబండారాలు అధిక ధరలకు విక్రయించకుండా హోటల్ యజమానులతో సమావేశం నిర్వహించాలని భద్రాచలం ఆర్డీఓకు సూచించారు. ప్రధాన రహదారి వెంట ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని డీఆర్డీఓను ఆదేశించారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా బారికేడ్ల ఏర్పాటుతోపాటు గజ ఈతగాళ్లను, నాటు పడవలను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. అత్యవసర వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. 108 వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. పర్ణశాలలోనూ ఏర్పాట్లు చేయాలని అన్నారు. సమావేశంలో ఆలయ ఈఓ రమాదేవి, డీపీఓ రమాకాంత్, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, డీఎంహెచ్ఓ శిరీష, ఆస్పత్రుల సమన్వయ అధికారి రవిబాబు, ఆర్టీఓ వేణు, ఆహార తనిఖీ అధికారి వేణుగోపాల్, ఆర్అండ్‌బీ ఈఈ భీమ్లా, డీఆర్ఓ అశోకచక్రవర్తి, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, ఎన్‌హెచ్ డీఈ శైలజ, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు స్వర్ణలత, రత్నకళ్యాణి, దేవస్థానం డీఈ రవీందర్, ప్రధాన అర్చకులు సీతారామానుజాచార్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మగౌరవంతో బతకాలి

దివ్యాంగులు ఆత్మగౌరవంతో బతికేలా అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఐడీఓసీలో మంగళవారం దివ్యాంగుల హక్కులు, సంక్షేమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దివ్యాంగులకు సమాజంలో సమానహక్కులు కల్పించాల్సిన భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఐడీఓసీ గేట్ నుంచి లోపలికి వచ్చేందుకు దివ్యాంగులకు ఉచిత బ్యాటరీ ఆపరేటెడ్ వాహనం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సదరన్ ధ్రువీకరణ పత్రాల కోసం 700 మంది దరఖాస్తు చేసుకున్నారని, అందరికీ పత్రాలు అందేలా చర్యలు చేపడతామని అన్నారు. డబుల్ ఇళ్లతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అవకాశం కల్పిస్తామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఈసీఐఎల్ కంపెనీ సీఎస్సార్ నిధులతో 408 బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిళ్లు మంజూరు చేశామని, మిగిలిన 204 సైకిళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండల కార్యాలయాల్లో దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. అర్హులైన దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి లెనీనా, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, జెడ్పీ సీఈఓ విద్యాలత, ఎస్సీ, బీసీ, మైనారిటీ సంక్షేమాధికారులు అనసూర్య, సురేందర్, సంజీవరావు పాల్గొన్నారు.

జీఓ 45ను రద్దు చేయండి

- గవర్నర్‌కు ఎమ్మెల్యే పొదెం వీరయ్య వినతి
- భద్రాద్రి అభివృద్ధిపై దృష్టి సారించాలని వేడుకోలు



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పొదెం వీరయ్య తదితరులు

భద్రాచలం: భద్రాచలాన్ని మూడు గ్రామ పంచాయతీలుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 45ను రద్దు చేయాలని, భద్రాచలం అభివృద్ధిపై దృష్టి సారించాలని రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్‌కు భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య మంగళవారం రాజ్‌భవన్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మూడు పంచాయతీలుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అనైతికంగా బిల్లు ప్రవేశపెట్టిందని, దాన్ని ఆమోదించవద్దని కోరారు. ఈ నిర్ణయాన్ని భద్రాద్రి వాసులంతా వ్యతిరేకిస్తున్నారని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర విభజన అనంతరం ముంపు మండలాలను ఏపీలో కలపడంతో భద్రాచలం భూభాగం రెండు కిలోమీటర్ల లోపే ఉందని, ఇప్పటికే డంపింగ్ యార్డ్ లేక ఇబ్బంది పడుతున్నామని, ఇప్పుడు మూడు పంచాయతీలుగా మారిస్తే మరిన్ని ఇక్కట్లు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. భద్రాచలం ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నిధులు మంజూరు చేయించాలని కోరారు. దుమ్ముగూడెం మండలంలోని సీతమ్మ సాగర్ భూ నిర్వాసితులకు నష్టపరిహారాన్ని రూ.30 లక్షలకు పెంచాలని అసెంబ్లీలో ప్రస్తావించినా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని, దీనిపైనా దృష్టి పెట్టాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. భద్రాచలానికి చెందిన గొంగడి త్రిష అండర్–19 మహిళల వరల్డ్ కప్ పోటీలలో ఇండియా టీంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి ప్రపంచ కప్ సాధించడంలో కీలక భూమిక పోషించిందని, అలాంటి క్రీడాకారిణికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం అందలేదని, త్రిషకు సహాయ సహకారాలు అందేలా సిఫారసు చేయాలని విన్నవించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సరేళ్ల నరేష్, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, నాయకులు గాల శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణా రెడ్డి, తెల్లం నరేష్, బూర లక్ష్మీనారాయణ ఉన్నారు.

అసాంఘిక శక్తుల సమాచారం అందించాలి

ఆదివాసీ యువతకు ఎస్పీ సూచన



ఆదివాసీ గ్రామానికి బైక్‌పై వెళ్తున్న ఎస్పీ



ఆదివాసీలకు దోమతెరలు పంపిణీ చేస్తున్న ఎస్పీ వినీత్

పినపాక/మణుగూరుటౌన్: అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లోకి వస్తే తమకు సమాచారం అందించాలని ఎస్పీ వినీత్ అన్నారు. మంగళవారం ఆయన మణుగూరు, పినపాక మండలాల్లో పర్యటించారు. పినపాక మండలంలోని వలస ఆదివాసీ గ్రామం పిట్టతోగులో ఓఎస్డీ సాయి మనోహర్‌తో కలిసి సోలార్ వీధి లైట్లు, వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. అనంతరం యువకులతో కలిసి కాసేపు వాలీబాల్ ఆడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదివాసీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఉండడానికి ఇల్లు, సాగు భూమి కల్పిస్తుందని చెప్పారు. యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఆరోగ్యం పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, పోలీస్ శాఖ తరఫున వారానికి ఒకసారి నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామస్తులకు దోమతెరలు, పిల్లలకు పండ్లు, బిస్కెట్లు, భోజనం అందజేశారు. ఆ తర్వాత మణుగూరులోని ఇల్లెందు క్లబ్‌లో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. పోలీసుస్టేషన్‌కు వచ్చేవారికి న్యాయం చేస్తామనే భరోసా కల్పించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించాలని, వారి సమస్యలు సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, విద్యార్థినులకు షీ టీమ్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి, మట్కా, బెట్టింగుల వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, పలువురు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆందోళనలకు సిద్ధం



కేటీపీఎస్ కాంప్లెక్స్

- విద్యుత్ సంస్థల్లో గతేడాదే ముగిసిన వేతన సవరణ అమలు
- పీఆర్సీ కోసం 11 నెలలుగా యాజమాన్యంతో చర్చలు
- 24 నుంచి ఉద్యమమే అంటున్న ఉద్యోగ, కార్మిక సంఘాలు

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్‌లు, పెన్షనర్లు వేతన సవరణ కోసం 11 నెలలుగా ఎదురుచూస్తున్నారు. 2018లో ఇచ్చిన వేతన సవరణ 2022 మార్చి 31తో ముగిసింది. ముందుగానే మరో కమిటీని నియమించి సకాలంలో కొత్త వేతనాలు అందించాల్సి ఉండగా.. యాజమాన్యం, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. అంతేకాక 1999 నుంచి 2004 వరకు విధుల్లో చేరిన ఉద్యోగులు సైతం ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చాలని కోరుతుంటే అదీ కార్యరూపం దాల్చలేదు. పీఆర్సీ వస్తుందనే ఆశతో ప్రతినెలా ఎదురు చూస్తున్నా అసంతృప్తే మిగులుతోంది. ఈ క్రమంలో ఈనెల 24 నుంచి ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

ఐదు శాతమైనా వచ్చేనా ?

కొత్త పీఆర్సీ 45 శాతం ఇవ్వాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నాయి. అయితే యాజమాన్యం 5 శాతం ఇచ్చేందుకు సానుకూలంగా ఉన్నా.. ప్రభుత్వ అనుమతి కోసం వేచి చూస్తోంది. 2018లో పీఆర్సీ 35 శాతం ఇచ్చారు. అయితే ఈసారి 45 శాతం అడుగుతుండగా కనీసం 20 శాతం ఇచ్చినా మేలు జరుగుతుందనే ఆశతో ఉద్యోగులు ఉన్నారు. కానీ 45 శాతం ఇవ్వాలనే డిమాండ్‌తోనే ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

నష్టాలను సాకుగా చూపుతున్న సంస్థ..

జెన్‌కోలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగుల పీఆర్సీ పెంపు విషయంలో యాజమాన్యం నష్టాలను సాకుగా చూపిస్తోందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం 24 గంటల ఉచిత కరెంట్‌తో పాటు, ఇతర కుల సంఘాలకు చేయూత ఇవ్వాలనే లక్ష్యంతో ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఈ సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం ఇతర మార్గాల ద్వారా సంస్థకు అందించాల్సి ఉండగా, యాజమాన్యం అడిగే పరిస్థితి లేదు. ఇదిగాక రోజు రోజుకూ బొగ్గు, ఆయిల్, ఇతర ధరలన్నీ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో సంస్థకు నష్టాలు వస్తున్నాయని యాజమాన్యం చెబుతోంది. ఇప్పటికే భారీ వేతనాలు ఉన్నాయని అంటున్నట్లు సమాచారం. అయితే అన్ని రకాల ధరలు పెరగడంతో తమకు వేతనం సరిపోవడం లేదని ఉద్యోగులు చెబుతున్నారు.

భవిష్యత్ ఆందోళనలకు సిద్ధం

11 నెలలుగా పీఆర్సీ కోసం యాజమాన్యంతో చర్చిస్తున్నా ఫలితం లేనందున ప్రత్యక్ష ఆందోళనలు చేయాలని 23 కార్మిక సంఘాలు నిర్ణయించాయి. టీఎస్‌పీఈ జేఏసీ చైర్మన్ సాయిబాబు, కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ మేరకు తీర్మానం చేశాయి. ఈనెల 24, 25, 26 తేదీల్లో నల్లబ్యాడ్జిలతో నిరసన, మార్చి 1, 2 తేదీల్లో డివిజన్ ఆఫీస్‌లు, జనరేటింగ్ స్టేషన్‌ల వద్ద భోజన విరామ సమయంలో ప్రదర్శనలు, 3,4 తేదీల్లో సర్కిల్ కార్యాలయాలు, కార్పొరేట్ ఆఫీస్‌లు, జనరేటింగ్ స్టేషన్‌ల వద్ద ప్రదర్శనలు, 8 నుంచి 23 వరకు సర్కిల్, కార్పొరేట్ కార్యాలయాలు, జనరేటింగ్ స్టేషన్‌ల ముందు రిలే నిరాహార దీక్షలు, మార్చి 14న కేటీపీఎస్‌లో నిరసన సభ, 17న వరంగల్‌లో, 21న హైదరాబాద్ ఎస్‌పీడీసీఎల్ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు, 24న విద్యుత్ సౌధ ముందు మహాధర్నా చేయాలని నిర్ణయించారు.

నాన్చుడు ధోరణి తగదు



పీఆర్సీపై యాజమాన్యం, ప్రభుత్వం నాన్చుడు ధోరణి వీడాలి. ఇప్పటికే 11 నెలలుగా ఎదురు చూస్తున్నాం. పిల్లల చదువులు, వివాహాలు, గృహ నిర్మాణాల ధరలు పెరగడంతో వచ్చే వేతనాలు ఎటూ సరిపోవడం లేదు.

– డి.రాధాకృష్ణ, 1535 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

యాజమాన్యం స్పందించాలి



పీఆర్సీపై యాజమాన్యం వెంటనే స్పందించాలి. 2018 పీఆర్సీ గడువు గతేడాది మార్చితోనే ముగిసింది. కొత్త పీఆర్సీ రాక, వేతనాలు పెరగక ఉద్యోగులు, ఆర్టిజన్‌లు, పెన్షనర్లు ఇబ్బంది పడుతున్నారు.

– రావుల మురళి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు

ఐక్యంగా పోరాడుతాం



పీఆర్సీపై యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరి బాధాకరం. ఇకనైనా స్పందించకుంటే దశల వారీగా ఆందోళనలు చేస్తాం. కార్మిక, ఉద్యోగ, ఆర్టిజన్ కార్మిక సంఘాలన్నీ కలిసికట్టుగా పోరాడి విజయం సాధించడమే ధ్యేయం.

– కంటే రాజేందర్, 1104 యూనియన్ నేత

కొబ్బరి సాగు విస్తరించాలి



మాట్లాడుతున్న జినుగు మరియన్న

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పాం తోటల విస్తరణ తరహాలోనే కొబ్బరి తోటల సాగును పెంచాలని ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ జిల్లా అధికారి జినుగు మరియన్న అన్నారు. మండలంలోని నారంవారిగూడెం వద్ద గల కొబ్బరి విత్తనోత్పత్తి కేంద్రంలో మంగళవారం శ్రీ కొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన శాఖ, కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో కొబ్బరి సాగుదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా పామాయిల్ సాగుకు అందిస్తున్న రాయితీలు, ప్రయోజనాలను కొబ్బరి సాగుదారులకు కూడా అందించేలా కృషి చేస్తానని చెప్పారు. కొబ్బరి అభివృద్ధి సంస్థ విజయవాడ కార్యాలయ అధికారి మత్తే కిరణ్ మాట్లాడుతూ.. కొబ్బరి తోటల సాగు, విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త విజయ్ కృష్ణ, ఉద్యాన శాఖ నియోజకవర్గ అధికారి సందీప్, హెచ్ఓ కిషోర్, రైతులు ఆలపాటి రాము, కొక్కెరపాటి పుల్లయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

గిరిజన యువతికి డాక్టరేట్


బానోత్ ప్రవళిక

టేకులపల్లి: మండలంలోని మద్రాస్‌తండా పంచాయతీ కొండంగులబోడు తండాకు చెందిన యువతికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. తండాకు చెందిన బానోత్ ప్రవళిక కాకతీయ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఫిజిక్స్ పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించింది. 2019లో ప్రవేశ పరీక్ష రాసి, ప్రథమ ర్యాంకు పొంది హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీలో చేరింది. ప్రొఫెసర్ ప్రతాప్ కొల్లు ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రంలో ''సింథెసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ మల్టీఫెర్రాయిక్ బీఐఎఫ్ఇఓ3 (బీఎఫ్‌వో) అండ్ బీఎఫ్‌వో-బేస్డ్ హెటిరోస్ట్రక్చర్స్ ఫర్ ఫొటోకెటాలిసిస్ అప్లికేషన్స్'' అనే అంశంపై పరిశోధనా పత్రం సమర్పించగా, ఈనెల 8న యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. లండన్‌లో పోస్ట్ డాక్టరల్ ఫెల్లోషిప్‌నకు ప్రొఫెసర్ ప్రతాప్ తనను సిఫారసు చేశారని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

ఆటో పల్టీ : డ్రైవర్‌కు గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామంలో మంగళవారం ప్రమాదవశాత్తు ఆటో పల్టీ కొట్టింది. కొమరారం నుంచి ఇల్లెందుకు బయలుదేరిన ఆటో మార్గంమధ్యలో మూలమలుపు వద్ద అదుపుతప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఇల్లెందుకు చెందిన డ్రైవర్ కిషోర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని కొమరారం పీహెచ్‌సీకి తరలించగా, వైద్యులు ప్రథమ చికిత్స అందించారు.

విద్యుత్ మోటర్ల సర్వీస్ వైర్లు చోరీ

పాల్వంచరూరల్: మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతుల పంట పొలాలకు సాగునీరు పెట్టుకునేందుకు కిన్నెరసానివాగు ఒడ్డున ఏర్పాటు చేసుకున్న 30 విద్యుత్ మోటార్ల సర్వీస్ వైర్లు సోమవారం రాత్రి చోరీ చేశారు. ఒక్కో మోటారు వైరు విలువ రూ.5 వేలు ఉంటుందని బాధిత రైతు తోట మల్లేష్ తెలిపారు. గతంలో కూడా నాలుగు సార్లు విద్యుత్ మోటర్ల సర్వీస్ వైర్లను చోరీ చేశారని పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, దీంతో మంగళవారం బాధితులందరూ సమస్యను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి నట్టల మందు పంపిణీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని 23 మండలాల్లో బుధవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు మేకలు, జీవాలకు ఉచితంగా నట్టల మందు తాగించనున్నట్లు జిల్లా పశువైద్య, పశు సంవర్ధక అధికారి డాక్టర్ బి.పురంధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1.55 లక్షల గొర్రెలు, 2 లక్షల మేకలు మొత్తం కలిపి 3.55 లక్షల జీవాలకు నట్టల మందు తాగించనున్నట్లు పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది 53 టీంలుగా ఏర్పడి ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. జీవాలకు నట్టల మందు తాగించడం వల్ల నులిపురుగులు నశించి ఆరోగ్యంగా ఉంటాయని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

పాల్వంచ: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పాల్వంచ పట్టణ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నెహ్రూ నగర్‌లో గడ్డం మోహన్ రావు అనే వ్యక్తి ఇంటి ముందు 16 సంచుల్లో రేషన్ బియ్యం నింపి తరలించేందుకు సిద్ధంగా ఉంచారు. విశ్వసనీయ సమాచారంతో పట్టణ ఎస్ఐ నరేష్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. 6 క్వింటాళ్ల 40 కేజీల బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

దమ్మపేట సెంటర్‌లో..

ఆటోలో 2 క్వింటాళ్ల 80 కేజీల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా దమ్మపేట సెంటర్ వద్ద పట్టణ రెండో ఎస్ఐ జి.ప్రవీణ్‌కుమార్ పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కార్మికులంతా ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకోండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న లేబర్ కమిషనర్

నేలకొండపల్లి: సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ-శ్రమ్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని ఖమ్మం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ చల్లా వెంగమాంబ సూచించారు. మండలంలోని తిరుమలాపురంలో మంగళవారం ఇఫ్టూ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ-శ్రమ్ నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వెంగమాంబ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందాలంటే కార్మికులు తప్పకుండా ఈ-శ్రమ్‌లో చేరాలని, జిల్లాలో ఇంకా లక్ష మంది కార్మికులు వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉందని తెలిపారు. మార్చి నెలాఖరు వరకు అవకాశం ఉన్నందున వెంటనే కార్మికులు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాక్ ఫ్యాకల్టీ కె.రాంబాబు, సామాజిక కార్యకర్త కనకంపూడి రవితో పాటు తేజావత్ అరుణ, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

ఒక్కరా.. ఇద్దరా..!

- రూపం, గుణంలో ఒకే పోలిక
- నేడు కవలల దినోత్సవం

కవలలు రూపం, గుణంలో ఒకే పోలికతో ఉంటారు. తల్లిదండ్రులు కూడా పేర్లలో సారుప్యత ఉండేలా పెడుతుంటారు. బంధువులు, ఇరుగుపొరుగువారు వారిని గుర్తుపట్టలేక తికమక పడుతుంటారు. అయితే కొందరిలో ఇష్టాలు, అభిరుచులు భిన్నంగా కూడా ఉంటాయి. నేడు కవలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– పాల్వంచరూరల్


యాగల రోషన్, రోహన్

● బంధువులు గుర్తుపట్టలేరు

పాల్వంచకు చెందిన కవలలు యాగల రోషన్, రోహన్ ఆరో తరగతి చదువుతున్నారు. వారి ఇష్టాలు ఒకేలా ఉంటాయి. దుస్తులు కూడా ఒకేరకమైనవి తెస్తాంమని, చుట్టాలు, స్నేహితులు గుర్తుపట్టలేక పొరబడుతుంటారని తల్లిదండ్రులు నరేష్, గీత తెలిపారు.


భట్టు హేమబిందు, హేమలత

● ఏది కొన్నా సమానమే..

పాల్వంచ మండలం కరకవాగు గ్రామానికి చెందిన ఇద్దరు కవలలు భట్టు హేమబిందు, హేమలత ఉల్వనూరు ఎస్టీ గిరిజన ఆశ్రమ పాఠశాల్లో 6వ తరగతి చదువుతున్నారు. ఇద్దరి ఇష్టాలు ఒకేలా ఉంటాయి. ఏదికొన్నా ఇద్దరికి సమానంగా ఇవ్వాల్సిందేనని తల్లిదండ్రులు భాస్కర్‌రావు, దుర్గ తెలిపారు.

● అభిరుచులూ ఒక్కటే..

పాల్వంచ: పట్టణానికి చెందిన కవలలు సహస్ర, సమన్వి హైదరాబాద్‌లోని ప్రగతి నగర్‌లో ఇంటర్ చదువుతున్నారు. వీరి అభిరుచులు ఒకేలా ఉంటాయి. అన్ని విషయాల్లో సారుప్యంగా ఉంటారని, తల్లిదండ్రులు మేదరమెట్ల శ్రీనివాసరావు, హిమబిందు తెలిపారు.


తాటి పవన్‌కుమార్, ప్రదీప్‌కుమార్

● ఇష్టాలు భిన్నంగా..

జిన్నగట్టు గ్రామానికి చెందిన కవలలు తాటి పవన్‌కుమార్, ప్రదీప్‌కుమార్ పాల్వంచ మండలం కిన్నెరసాని డ్యామ్‌సైడ్‌లోని గిరిజన గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నారు. ఇద్దరు సోదరులు చూసేందుకు ఒకేలా ఉన్నా ఇష్టాలు మాత్రం భిన్నంగా ఉంటాయి. వస్త్రధారణ కూడా భిన్నంగా ఉంటుందని తల్లిదండ్రులు కృష్ణ, స్వప్న తెలిపారు.


సహస్ర, సమన్వి


భూక్యా వాణి, వీణ

● బాగా అల్లరి..

పాల్వంచలోని శ్రీనివాసకాలనీకి చెందిన ఇద్దరు కవలలు భూక్యా వాణి, వీణ. ఉల్వనూరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. ఇద్దరూ బాగా అల్లరిచేస్తారు. ఇష్టాలు, అభిరుచులు ఒకేలా ఉంటాయని తల్లిదండ్రులు రమేష్, జ్యోతి చెబుతున్నారు.

● రోజూ ఒకే రకం దుస్తులు..

జగన్నాథపురం గ్రామానికి చెందిన జాటోతు ప్రణీత, ప్రవళిక అంగన్‌వాడీ కేంద్రంలో ఎల్‌కేజీ చదువుతున్నారు. ఇద్దరి అభిరుచులు ఒకేలా ఉంటాయని, రోజూ ఒకే రకం దుస్తులు వేసుకుంటారని తల్లిదండ్రులు సురేష్, దీప చెబుతున్నారు. ఇరుగుపొరుగు ఒకరు అనుకుని మరొకరిని పిలుస్తుంటారని పేర్కొన్నారు.


జాటోతు ప్రణీత, ప్రవళిక

అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శం

- ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు
- రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బూర్గంపాడు/అశ్వాపురం: ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన అశ్వాపురం మండలంలో రూ.15.07 కోట్ల అభివృద్ధి పనులకు, బూర్గంపాడు మండలంలో రూ 4.80 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అశ్వాపురం మండలంలో రూ.2 కోట్లతో రామచంద్రాపురం-ఇరవెండి రహదారి, రూ.1.40 కోట్లతో గొల్లగూడెం-సర్వాయిపాడుబంజర రహదారి, రూ.2 కోట్లతో తురుములగూడెం- రైల్వేస్టేషన్ రహదారి, రూ.కోటితో సంద్రలబోడు-వెంకటేశ్వరస్వామి ఆలయం రహదారి, రూ.2 కోట్లతో గొందిగూడెం-ఎలకలగూడెం రహదారి, రూ.6.67 కోట్లతో ఎలకలగూడెం-మనుబోతులగూడెం రహదారుల నిర్మాణాలను కాంతారావు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో తహసీల్దార్ ఎం.ఏ.రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 50 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. బూర్గంపాడు మండలం మత్రికుంట, నకిరిపేట, చెరువు సింగారం గ్రామాల్లో రూ.4.80 కోట్ల నిధులతో నిర్మించనున్న కనెక్టివిటీ రహదారులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మత్రికుంట- వేపలగడ్డ గ్రామాల మధ్య రూ 2 కోట్ల సీసీ రోడ్డు, నకిరిపేట- ఉప్పుసాక గ్రామాల మధ్య రూ 2 కోట్లతో బీటీ రోడ్డు, క్రాస్‌రోడ్- చెరువుసింగారం గ్రామాల మధ్య రూ 80లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణాలను శంకుస్థాపన చేసి ప్రారంభించారు.


ఎలకలగూడెం-మనుబోతులగూడెం బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగా మాట్లాడుతూ మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న ఎన్నికలలో బీఆర్ఎస్‌ను ప్రజలు గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఐటీడీఏ ఈఈ రాములు, ఏఈ ప్రసాద్, సీఐ శ్రీనివాసరావు, ఎంపీడీఓలు వరప్రసాద్, వివేక్‌రామ్, తహసీల్దార్లు ఎం.ఏ.రాజు, భగవాన్‌రెడ్డి, జెడ్పీటీసీలు సూదిరెడ్డి సులక్షణ, కామిరెడ్డి శ్రీలత, బూర్గంపాడు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పొడియం ముత్యాలమ్మ, అశ్వాపురం వైస్ ఎంపీపీ వీరభద్రం, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కోడి అమరేందర్, గోపిరెడ్డి రమణారెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గజ్జల లక్ష్మారెడ్డి, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు కాక అశోక్, తాటి సుజాత, ఇస్లావత్ కమల, కుంజా రామారావు, పాయం భద్రయ్య, కలేటి నర్సింహారావు, పర్శిక సూరిబాబు, ఏనిక స్వరూప, కల్లూరి లక్ష్మీనారాయణ, మడకం సాధు, మత్రి మల్లారెడ్డి, జలగం జగదీష్, బిజ్జం శ్రీనివాసరెడ్డి, జక్కం సుబ్రహ్మణ్యం, కామిరెడ్డి రామకొండారెడ్డి, వల్లూరిపల్లి వంశీకృష్ణ, ఎన్నా అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

బాలికకు అండగా ఉంటాం

- ట్విట్టర్ వేదికగా మంత్రి కేటీఆర్ హామీ
- సీఎంఆర్ఎఫ్‌తో కృత్రిమ కాలు ఏర్పాటు..


బాలిక మానసతో ఎస్సై రామారావు, సంస్థ ప్రతినిధి సంతోష్

ములకలపల్లి : ఆపరేషన్‌తో కాలు కోల్పోయిన గిరిజన విద్యార్థిని కారం మానసకు అండగా ఉంటామని ఐటీ శాఖామంత్రి కే.తారక రామారావు ప్రకటించారు. బాలికకు కృత్రిమ కాలు అమర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. మండలంలోని పాతగుండాలపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు కూతురు కారం మానస ఏడో తరగతి చదువుతుండగా కాలుకు ఇన్ఫెక్షన్ సోకింది. పలుచోట్ల వైద్యం అందించినా నయం కాలేదు. దీంతో గతేడాది ఇంటర్మీయట్ పూర్తి చేసిన బాలిక విద్యాభ్యాసం నిలిపివేసి, ఇంట్లోనే ఉంటోంది. సమస్య స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు దృష్టికి రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి పంపించి, వైద్యం చేయించారు. రూ. 25 వేలు నగదు సాయం అందించారు. ఆపరేషన్ కోసం రూ. 4 లక్షలు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరు చేయించారు. ఇన్‌ఫెక్షన్ పెరిగి పోవడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి మోకాలుపైభాగం వరకు తొలగించారు.

పీపుల్స్ హెల్పింగ్ చిల్డ్రన్ సంస్థ చొరవతో ...

ములకలపల్లి వాసి, కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు, హైదరాబాద్‌కు చెందిన పీపుల్స్ హెల్పింగ్ చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సంతోష్ బాలిక దీనస్థితిని తెలుసుకుని కృత్రిమ కాలు అమర్చేందుకు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు రూ. 2.5 లక్షల ఖర్చవుతుందని తెలపగా, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సంతోష్ ఆ విషయాన్ని ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్‌కు ట్యాగ్ చేశారు. దీంతో ఆయన స్పందించి మానసకు అండగా ఉంటామని తెలిపారు. మంత్రి కేటీఆర్ కార్యాలయ అధికారులు మంగళవారం ఫోన్లో సంతోష్‌ను సంప్రదించి, వివరాలు సేకరించారు. వారం రోజుల్లో సీఎంఆర్ఎఫ్ ద్వారా మానసకు కృత్రిమ కాలు ఏర్పాటుకు పూర్తిసహకారం అందిస్తామని పేర్కొన్నారు. దీంతో మానస కుటుంబీకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ పథకాల్లో నంబర్ వన్


రొట్టమాకురేవులో రైతు వేదికను ప్రారంభిస్తున్న ఎంపీ నామా, పక్కన ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే రాములునాయక్

- ఎంపీ నామా నాగేశ్వరరావు
- మండలంలో రైతు వేదిక భవనాలు ప్రారంభం
- హాజరైన ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే రాములునాయక్

కారేపల్లి: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు వెల్లడించారు. మండలంలోని ఉసిరికాయపల్లి, అప్పాయిగూడెం, రొట్టమాకురేవుల్లో రైతు వేదిక భవనాలను ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యే రాములునాయక్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం రొట్టమాకురేవులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

గత ఎన్నికల్లో నాకు నష్టం..

ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ గత లోక్‌సభ ఎన్నికల్లో తనకు కారేపల్లి మండలం నుంచి తీవ్ర నష్టం జరిగిందని వెల్లడించారు. ఈ లెక్కలన్నీ తన వద్ద ఉన్నాయని, క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన వారెవరో తెలుసునని చెప్పారు. రానున్న ఎన్నికల్లోనైనా అలా జరగకుండా చూడాలని సూచించారు. ఎంపీ ల్యాడ్ నిధులు నుంచి నాలుగు గ్రామాలకు రూ.20లక్షలు, నామా ముత్తయ్య ట్రస్టు నుంచి బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ మధుసూదన్ మాట్లాడుతూ మంచి హృదయం ఉన్న ఎమ్మెల్యే రాములునాయక్ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు. అయితే, ఏడేళ్ల బీఆర్ఎస్ పదవులు అనుభవించి ఇప్పుడు సీఎం, పార్టీని విమర్శిస్తున్న వారికి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ మాలోతు శకుంతల, జెడ్పీటీసీ వాంకుడోతు జగన్, తహసీల్దార్ తూమాటి శ్రీనివాస్, ఎంపీడీఓ చంద్రశేఖర్, డీఏఓ విజయనిర్మల, ఏడీఏ బాబురావు, ఏఓ కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, పీఆర్ డీఈ వెంకటరెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు రావూరి శ్రీనివాసరావు, పర్సా పట్టాభిరామారావు, ముత్యాల సత్యనారాయణ, దుగ్గినేని శ్రీనివాసరావు, ధరావత్ మంగీలాల్, ధరావత్ పాండ్యానాయక్, భూక్యా రంగారావు, బానోతు బన్సీలాల్, అజ్మీరా అరుణ, ఈసం అరుణ తదితరులు పాల్గొన్నారు. కాగా, కారేపల్లిలో రైళ్ల హాల్టింగ్, ఫ్లై ఓవర్ నిర్మాణంపై కారేపల్లికి చెందిన ఇందుర్తి సురేందర్‌రెడ్డి, పిల్లి వెంకటేశ్వర్లు ఎంపీకి వినతి పత్రాలను అందచేశారు.

ఫ్లెక్సీలో పొంగులేటి ఫొటో

అప్పాయిగూడెంలో రైతు వేదిక ప్రారంభోత్సవం సందర్భంగా ఎంపీ తదితరులకు స్వాగతం పలుకుతూ బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో ఇటీవల పార్టీని విబేధించిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫొటోలు దర్శనమిచ్చాయి. అలాగే, పార్టీ నుంచి సస్పెండ్‌కు గురైన మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ తదితరులు ఫొటోలు కూడా ఉండడంతో కార్యకర్తలు అయోమయానికి గురయ్యారు. అయితే, గతంలో సిద్ధం చేయించిన ఫ్లెక్సీలను ఏర్పాటుచేయగా, పొరపాటు గుర్తించి తొలగించినట్లు నాయకులు తెలిపారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రైవేట్ అభ్యర్థులకు ప్రవేశం పొందేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసరావు తెలిపారు. సంబంధిత ట్రేడ్లలో మూడేళ్ల సర్వీసు పూర్తయి, జీపీఎఫ్/ఈపీఎఫ్ నంబర్ కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. సీఓపీఏ, డీఎం సివిల్, డ్రెస్ మేకింగ్, ఎలక్ట్రీషియన్ ట్రేడ్లలో రెండేసి సీట్లు, వెల్డర్ ట్రేడ్‌లో నాలుగు సీట్లు ఖాళీగా ఉండగా, ఆసక్తి, అర్హతలు ఉన్న వారు ఈనెల 28వ తేదీలోగా వరంగల్‌లోని రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

మావోయిస్టు ఎల్‌ఓఎస్ కమాండర్ అరెస్ట్

కొత్తగూడెంటౌన్: నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ శబరి ఎల్‌ఓఎస్ కమాండర్ పద్దం కోసయ్య అలియాస్ కొవ్వాసి కోసయ్య(సందీప్)ను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. చర్ల మండలం ఎర్రబోరు అటవీ ప్రాంతంలో చర్ల పోలీసులు, కొత్తగూడెం స్పెషల్‌పార్టీ సిబ్బంది, 141 సీఆర్‌పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తున్న క్రమంలో అరెస్ట్ చేశారని, ఇతనిపై రూ.4 లక్షల రివార్డు ఉందని ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చర్ల మండలం చెన్నాపురం గ్రామానికి చెందిన పద్దం కోసయ్య 2017లో మిలీషియా సభ్యుడిగా చేరాడని, 2022 నుంచి శబరి ఏరియా ఎల్‌ఓఎస్ కమాండర్‌గా పని చేస్తున్నాడని తెలిపారు. 2019 జూలైలో చర్ల మండలం బెస్త కొత్తూరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ నల్లూరి శ్రీనివాస్‌ను కిడ్నాప్ చేసి హతమార్చిన సంఘటన, 2020 మార్చిలో 17 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను, 2021 ఏప్రిల్‌లో తెర్రెం పీఎస్ పరిధిలో 24 మంది సీర్పీఎఫ్ జవాన్లను హతమార్చిన సంఘటన, 2022 ఆగస్టులో చర్ల మండలం కుర్నపల్లి గ్రామ ఉపసర్పంచ్ ఇర్ప రాముడిని కిడ్నాప్ చేసి హతమార్చిన ఘటనలో నిందితుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇతనిపై చర్ల పోలీసు స్టేషన్‌లో 24 కేసులు, దుమ్ముగూడెం ఒకటి, ఏపీలో 7 కేసులు, ఛత్తీస్‌గఢ్‌లో 8 కేసులు ఉన్నాయని వివరించారు. ఐఈడీ ట్రెనింగ్ బుక్, 10 జిలెటిన్ స్టిక్స్, 2 ఎలక్ట్రిక్ డిటోనేటర్లు 2, 2 కార్డెక్స్ వైర్లు, మావోయిస్టు సాహిత్యం, కిట్ బ్యాగ్ మొబైల్ ఫోన్ తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కోసయ్య మైనర్లను బలవంతంగా మావోయిస్టు పార్టీలో చేర్చి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని ఎస్పీ పేర్కొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వినీత్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతి చెందిన ఆదెమ్మ

సుజాతనగర్: గుర్తుతెలియని వాహనం ఢీకొని రోడ్డు దాటుతున్న ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన ఖమ్మం-కొత్తగూడెం ప్రధాన రహదారిపై నాయకులగూడెం గ్రామం వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... నాయకులగూడెం గ్రామానికి చెందిన చింతల ఆదెమ్మ(50) గ్రామంలోని రోడ్డు పక్కన ఉన్న కిరాణా దుకాణంలో కూరగాయలు తీసుకొని ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో ఖమ్మం వైపు నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కారు లేదా బొలెరో వాహనం ఢీకొట్టి ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించే పనిలో ఉన్నట్లు ఎస్ఐ పి.తిరుపతిరావు తెలిపారు.

అండ కోల్పోయిన కుటుంబం

ఆదెమ్మ భర్త వెంకట నారాయణ పక్షవాతంతో బాధపడుతున్నాడు. దంపతులకు ముగ్గురు సంతానం కాగా, కూతురికి వివాహం చేశారు. ఇద్దరు కుమారులు కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నారు. భర్తకు పక్షవాతం కావడంతో ఆదెమ్మ మేకలను కాసుకుంటూ భర్తను, పిల్లలను పోషిస్తోంది. ఆమె మృతితో కుటుంబం రోడ్డున పడినట్లయింది.

తగ్గిన నాగార్జున సాగర్ జలాల ఇన్‌ఫ్లో

చివరి ఆయకట్టుకు నీరందడం లేదని రైతుల ఆందోళనలు

ఖమ్మం అర్బన్: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నుండి ఖమ్మం జిల్లా ఆయకట్టుకు అందాల్సిన జలాల ఇన్‌ఫ్లో లెక్కల ప్రకారం కొనసాగకపోవడంతో చివరి భూములకు నీరందడం లేదు. ఫలితంగా పంటలు ఎండిపోతున్నాయని రైతులు ధర్నాలకు దిగడం, ఈ అంశంపై ఉన్నతాధికారులకు సంజాయిషీ ఇవ్వలేక తాము ఇబ్బంది పడుతున్నామని జలవనరులశాఖ ఇంజనీర్లు వాపోతున్నారు. ఇందులో భాగంగా ఒక సీఈ సెలవులో వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. వేసవి సాగు అవసరాల కోసం తొమ్మిది రోజులు ఆన్, ఆరు రోజులు ఆఫ్‌గా వారబందీ విధానంలో నీరు విడుదల చేస్తున్నారు. అయితే, పైనుంచి లెక్కల ప్రకారం నీరు రాకపోవడం.. ఇంకో పక్క కాల్వల్లో పూడిక, ఎండల ప్రభావం కారణంగా చివరి ఆయకట్టుకు నీరు అందకముందే సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా రైతులు ఆందోళన బాట పడుతున్నారు. సాగర్ ప్రాజెక్ట్ నుండి పాలేరు చెరువుకు ఇన్ ఫ్లో 6,400 క్యూసెక్కులు నీరు రావాల్సి ఉన్నా ప్రస్తుతం రోజూ 3 వేల నుండి 3,200 క్యూసెక్కులే వస్తోందని అధికారులు చెబుతున్నారు. దీంతో స్థిరీకరించిన ఆయకట్టుకు నీరందడం లేదు. మరోపక్క సాగునీటి శాఖలన్నీ ఒకే గొడుగు కిందకు వచ్చిన నేపథ్యాన పర్యవేక్షణ లోపిస్తోందని సమాచారం. కాగా, జిల్లాలో సాగర్ నీటి సరఫరాలో ఇబ్బందులపై ఖమ్మం కలెక్టర్ మంగళవారం జలవనరులశాఖ అధికారులతో మంగళవారం సమీక్షించి పలు సూచనలు చేసినట్లు తెలిసింది.

ఖమ్మంలో అదృశ్యం.. హైదరాబాద్‌లో ప్రత్యక్షం

ఖమ్మంక్రైం: ఖమ్మం వన్‌టౌన్ పరిధిలో గత శుక్రవారం అదృశ్యమైన మైనర్ బాలిక హైదరాబాద్‌లో ప్రత్యక్షమైంది. దీంతో కుటుంబసభ్యులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. వన్‌టౌన్ ప్రాంతంలోని సీక్వెల్ రిసార్ట్స్ సమీపాన నివసిస్తున్న ఏడో తరగతి విద్యార్థినిని తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు గాలింపు చేపట్టారు. ఈక్రమంలో బాలిక తాను హైదరాబాద్ మణికొండలోని బంధువుల ఇంట్లో ఉన్నట్లు ఫోన్ చేయగా తీసుకురావడానికి మంగళవారం హైదరాబాద్ వెళ్లారు. ఈ అంశాన్ని వన్ టౌన్ పోలీసులు ధృవీకరించారు.

వివాహితపై అత్యాచారయత్నం

ఏన్కూరు: అత్యాచారయత్నం ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని భద్రుతండాకు చెందిన వివాహిత, ఆమె భర్త ఈనెల 19న రాత్రి నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన బానోతు సీతారాం ఆమె చేయి పట్టి లాగి అత్యాచారానికి యత్నించాడు. ఈ సమయాన భర్త మేల్కొనడంతో సీతారాం పారిపోగా, కొద్దిరోజులుగా తనను వేధిస్తున్నట్లు బాధితురాలు చేసిన ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్సై సాయికుమార్ తెలిపారు.